జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com






# పండుగ పూట.. విషాదం

*** ఒకే రోడు ఏడుగురు మృతి * పలువురికి గాయాలు * పలు ఆసుపత్రుల్లో చికిత్స *సంద్రంలో జారిపడి ఒకరు * ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ఇంకొకరు * లారీ ఢీకొని ఇద్దరు * మనస్తాపంతో దుర్మరణం * చికిత్స పొందుతూ మరొకరు మృతి**

**శ్రీకాకుళం క్రైం, జనవరి 16 (వార్త):** ఉమ్మడి జిల్లాలో పండుగపూట విషాదం చోటుచేసుకుంది. వివిధ ఘటనల్లో ఏడుగురు మృతి చెందగా, మరికొందరు గాయాలపాలయ్యారు. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొని ఒకరు, లారీ ఢీకొని మరో ఇద్దరు, సముద్రంలో జారిపడి ఇంకొకరు, మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకొని మరొకరు మృతి చెందగా, ఆటో బోల్తా పడి 16 మంది గాయపడ్డారు.

## సముద్రంలో పడి మత్స్యకారుడి మృతి

**గార:** బందరువానిపేట గ్రామానికి చెందిన కుందు గడ్డియ్య(41) సముద్రంలో పడి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే గడ్డియ్య గురువారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు సహచరులతో కలిసి మర బోటుపై చేపల వేటకు బయల్దేరారు. కొంత సేపటికి బోటు రాకాసి అలకు చిక్కడంతో కుదుపునకు గురైంది. ఈ క్రమంలో గడ్డియ్య జారి నీటిలో పడిపోయారు. సహచరులు ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. ఇంతలో కెరటాల తాకిడికి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు.



## యువకుడి ఆత్మహత్య

బిహార్‌కు చెందిన వికాస్ కుమార్(20) రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామంలోని ఓ బియ్యం మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. గురువారం మిల్లు ఆవరణలో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. వ్యక్తిగత కారణాలతో ఈ దారుణానికి పాల్పడినట్లు సహచరులు చెబుతున్నారు. సహచరుడు సుఖేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు.

## భార్య, బిడ్డలను చూసేందుకు వెళుతూ..

**సోంపేట:** పండగపూట భార్యబిడ్డల్ని చూసేందుకు వెళ్లి ఓ వ్యక్తి విగతజీవిగా మారిన ఘటన విశాఖపట్నం రైల్వే ఫ్లైఓవర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. విశాఖకు చెందిన మండపాటి రాజు(50) ఉద్యోగ రీత్యా సోంపేటలో ఉంటున్నారు. విశాఖపట్నంలోని తన భార్య, పిల్లలను చూసేందుకని వెళ్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బుధవారం సాయంత్రం సోంపేట నుంచి బయలుదేరారు. గురువారం విశాఖ రైల్వే వంతెనపై విగతజీవిగా పడి ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావించి కేజీహెచ్‌కు తరలించారు. మృతదేహం వద్ద లభించిన టికెట్, ఇతర వివరాల ఆధారంగా సోంపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడ పరిశీలించగా చౌకపేటకు చెందిన రాజుగా నిర్ధారించి కుటుంబసభ్యులకు విషయం తెలియజేశారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అంతా విశాఖపట్నంలోనే ఉంటుండగా రాజు చౌకపేటలో ఉంటూ అప్పుడప్పుడు వెళ్లి వస్తుంటాడని స్థానికులు పేర్కొంటున్నారు.

## గాయపడిన వృద్ధుడి..

కొత్తూరు: రహదారి ప్రమాదంలో గాయపడిన శిల్లా చక్రవర్తి (65) రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పారాపురం సమీపంలో బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈయన తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

**వంగర:** పార్వతీపురం జిల్లా సీతానగరం మండలం మరిపివలస సమీపంలో ఈ రోడ్డు ప్రమాదంలో వంగర మండలం కొట్టిశ గ్రామానికి చెందిన లోలుగు రాంబాబు(41), శివసాయి (9) అక్కడికక్కడే మృతి చెందారు. భార్య, మరో కుమారుడికి గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై భార్య, కుమారులతో అత్తవారి గ్రామమైన రామభద్రపురం వెళుతుండగా లారీ ఢీకొంది. రాంబాబు 108 వాహనంలో పనిచేస్తుండేవాడు.

## ఎదురెదురుగా వాహనాలు ఢీకొని..

**పలాస:** పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పలాస కేటి రోడ్డులో ఉన్న జీడి పిక్క జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పిక్క జంక్షన్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో పలాసకు చెందిన లక్కోజు కనకరాజు తీవ్రగాయాలతో శ్రీకాకుళం లోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరోక వ్యక్తి సింహాద్రి సీతారాం కూడా గాయాలతో పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

## రెండు ఆటోల బోల్తా

**సీతంపేట:** సీతంపేట మండలం ఆడలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలోని వెల్లంగూడ సమీపంలోని మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 16 మంది వరకు గాయపడ్డారు. కొండ పైనుంచి కిందకు దిగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాలకొండ మండలం వాటపాగు, బూర్జ మండలం కురుంపేటకు చెందిన పలువురు వేర్వేరు ఆటోల్లో అక్కడికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో ఢీకొన్నాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పాలకొండ ప్రాంతీయాసుపత్రి సూపరింటెండెంటు నాగభూషణరావు వారిని ఐటీడీఏ అంబులెన్సులు, సొంత వాహనాల్లో పాలకొండ, సీతంపేట ప్రాంతీయాసుపత్రులకు తరలించారు. కీర్తిక, సాయిఈశ్వర్, హిమబిందు, సూర్యారావు, స్వాతి, సాయిసుధ, సరస్వతి, శ్రావణి, ప్రశాంతి, సంజన, చిరంజీవి, ఇందుమతి, యశోదమ్మ, వెంకట అప్పలనాయుడు తదితరులు గాయపడ్డారు. వెల్లంగూడ వద్ద నిల్చుని ఉన్న రెల్లయ్యను ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయనతో పాటు ప్రయాణికురాలైన యామినిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అమ్మన్నరావు తెలిపారు.




# సీపీఎం నేత వీజీకే మూర్తి మృతి

*** నివాళులు అర్పించిన పార్టీ నేతలు, ప్రజా సంఘాలు**
*** అతని కళ్లను దానం చేసి కుటుంబీకులు**



**శ్రీకాకుళం క్రైం, జనవరి 16 (వార్త):** సీఐటీయు శ్రీకాకుళం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నేత వీజీకే మూర్తి (74) గురువారం మృతి చెందారు. ఈ నెల 15న తీవ్ర అస్వస్థతకు గురికావడంతో శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబీకులు చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మరణించారు. సీపీఎం, ప్రజాసంఘాల్లో అనేక బాధ్యతలను నిర్వర్తించి తనదైన ముద్ర వేసుకున్నారు. 1972లో ఆయన ఎల్ఐసిలో ఉద్యోగిగా చేరారు. 1992లో సిఐటియు జిల్లా వ్యవస్థాపక అధ్యక్షునిగా పనిచేశారు. 1991లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా సేవలందించారు. జ్యూట్,శాంపిస్టన్ కార్మికుల సుదీర్ఘ పోరాటంలో కీలక పాత్ర వహించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షునిగా, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. వీజీకే మూర్తి మృతి ప్రజా పోరాటాలకు, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహచలం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజయ్ శర్మ అన్నారు. ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

తాను మృతి చెందితే నేత్రాలను దానం చేయాలని వీజీకే మూర్తి గతంలో కుటుంబీకులకు సూచించారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు వి.స్రవంతి, డి.శ్రీనివాస్‌లు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకి సమాచారం అందజేశారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత, సహాయకులు పి.సుమతి.. వీజీకే మూర్తి కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

## మూర్తి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు, అభ్యుదయ వాది వి.జి.కె.మూర్తి అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.ఏ.ఎన్.భుక్త, బాడాన రాజు అన్నారు. కార్మిక, కర్షక,ఉద్యోగ, ఉపాధ్యాయ పక్షపాతిగా వారి హక్కుల సాధనకు జరిగిన అనేక పోరాటాలకు మూర్తి అండగా నిలిచాలరన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గరిమెళ్ళ సత్యనారాయణ భావజాల వ్యాప్తికి గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం స్థాపించి సమకాలీన అంశాల మీద సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేసేవారని తెలిపారు. వి.జి.కె.మూర్తి కి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపాన్ని తెలియజేసిన వారిలో గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.ఏ.ఎన్. భుక్త, బాడాన రాజు, సభ్యులు వై.ఏ. లక్ష్మణ రావు, ఐ.గణపతి రావు, కె.శ్రీనివాసరావు, డి.కోటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పోస్టాఫీసులో ప్రింటర్ సమస్య



**ఇచ్ఛాపురం, జనవరి 16 (వార్త):** ఇచ్ఛాపురం సబ్ పోస్ట్ ఆఫీసులో ప్రింటర్ సమస్య గత కొంతకాలంగా వేధిస్తోంది. పాస్‌బుక్ ప్రింటర్ మూడు నెలలుగా పని చేయడం లేదు. దీంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పొదుపు పథకాలలో లక్షల రూపాయలు జమ చేసి కొత్త పుస్తకాలు కోసం నెలలు తరబడి ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి రెండు లేదా మూడు నెలలు కోసారి పాస్ పుస్తకాలు ప్రింట్ చేసి ఇస్తున్నారు. రోజువారి జమలు చేతి రాతతో ఇస్తున్నారు. దీంతో ఖాతాదారులు ఆందోళనకు గురి అవుతున్నారు. రెండు కౌంటర్ లు తెరిచి రెండు చోట్లా పాస్ బుక్ ప్రింటింగ్ మిషన్ లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# పేదలపై కొర్ల కన్నారావు దాతృత్వం

*** వందలాది మందికి వస్త్రాలు పంపిణీ * వీవీఆర్‌పురంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత**

**మందస, జనవరి 16(వార్త):** గాయత్రి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొర్ల కన్నారావు ఉదారతను మరోసారి చాటుకున్నారు. సంక్రాంతి సందర్భంగా వందలాది మంది నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతీ ఏటా కన్నారావు గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. కాగా, ఈ ఏడాది ఇస్కాన్ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. మందస మండలంలోని బిన్నళమదనాపురం పంచాయతీలో వెంకటవరదరాజపురంలో సంక్రాంతి సందర్భంగా పలు కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రవచనాలు జరిగాయి. బంకిదాసుప్రభు ఆధ్యాత్మిక ప్రసంగాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కన్నారావుతో పాటు భక్తులు భక్తి, తన్మయత్వంతో నాట్యం చేయడం విశేషం. సోంపేట మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన కళాకారిణి సుధీష్ణ భరత నాట్యం, కూచిపూడి



నాట్యం ప్రదర్శించారు. సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కొర్ల కన్నారావు, మాజీ ఎంపీపీ కొర్ల కవిత, కుమార్తె మహిమ, కుమారుడు శశాంక్ చేతుల మీదుగా 400 మందికి వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో కొంచాడ సురేష్ కుమార్, కారి ఈశ్వరరావు, మార్పు వెంకటేశం, బాడ సుదర్శనరావు, జగదీష్ పండా, ప్రధాన మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.





### సంఘటిత రైతాంగ పోరాటమే

# ‘మార్పు’కు నిజమైన నివాళి

*** కళింగాన తొలితరం కమ్యూనిస్టు మార్పు పద్మనాభం * హరిపురం మార్పు మెమోరియల్ ట్రస్టు వద్ద ప్రజా సంఘాల నివాళి**

**మందస, జనవరి 16(వార్త):** విప్లవించిన వీరుడు. విప్లవాల యోధుడు, రైతాంగ విప్లవ వైతాళికుడు, మందస గడ్డపైన మార్పును కోరిన ధీరుడు, నెత్తుటి నేలలో అరుణారుణ బాటలో....చరిత్ర ప్రసిద్ధికెక్కిన కామ్రేడ్ మార్పు పద్మనాభం తాత 59వ స్మారక సభ హరిపురం మార్పు గ్రంథాలయంలో మార్పు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత మార్పు తాత విగ్రహంపైన పూలదండలతో అరుణాంజలి ఘటించిన తర్వాత నిర్వహించిన సభకు అధ్యక్షత వహిస్తూ.. డాక్టర్ ఖగేశ్వరరావు మాట్లాడారు. మందస, సోంపేట , పలాస ప్రాంతాల రైతాంగం చిరకాల కోర్కెగా కొనసాగుతూ వస్తున్న తాగు, సాగునీటి సౌకర్యాలను సంపూర్ణంగా ప్రజలకు లభ్యమయ్యేంతవరకూ అవిశ్రాంతంగా పోరాడటమే మార్పు పద్మనాభం తాతకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. చిరకాల కోర్కెలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని, సమస్యల పరిష్కారం కోసం ఇక్కడి రైతాంగం సంఘటితంగా దీర్ఘకాల సమరశీల ఉమ్మడి పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్పు ట్రస్టు ఉపాధ్యక్షుడు కంసు కృష్ణమూర్తి, కోశాధికారి నల్ల హడ్డి, మార్పు ట్రస్టు కార్యవర్గ సభ్యులు ఉగ్రిపల్లి సోమనాథం, వి.వి. రమణమూర్తి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకుడు పుచ్చ దుర్యోధన, ఏపీసీఎల్సీ జిల్లా అధ్యక్షుడు పి.దానేష్, పిడిఎఫ్ అధ్యక్షుడు సాలిన వీరాస్వామి, ప్రజా కళాకారుడు దాసరి తాతారావు, మూఢనమ్మకాల నిర్మూలనా సంఘం నాయకుడు కె. ఉమాపతి, రంగోయి గిడుగు రామమూర్తి తెలుగు భాష



ప్రతినిధి బద్రి అప్పన్న స్మారక జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు, ఉద్దానం చైతన్య రైతు సంఘం, మందస రైతు సంఘం నాయకులు, చైతన్య మహిళా సంఘం నాయకురాలు నాగమణి, పలు ప్రజా సంఘాల కార్యకర్తలు పులారి దుర్యోధన, మార్పు అనంతరావు, పులారి మోహన్రావు, మార్పు రవీంద్ర , తెప్పల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నివారణకే

## రహదారి భద్రత మాసోత్సవాలు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 16 (వార్త):** ప్రమాదాల నివారణకు వచ్చేనెల 15 వరకూ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవదానం తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళం-1వ డిపో గ్యారేజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడారు. చోదకులు రహదారిపై భారీవాహనాలను నడిపేటప్పుడు ఏకాగ్రత పాటించాలన్నారు. ఇతర వాహన చోదకుల గమనాలను గమనిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. శ్రీకాకుళం 1వ డిపో మేనేజరు మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం-2 డిపో మేనేజర్ శర్మ, శ్రీకాకుళం-1,2 సహాయ మేనేజర్లు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎల్.ఎస్.నాయుడు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు భాస్కరరావు, మూర్తి, అసోసియేషన్ ప్రతినిధులు, భద్రత, నిఘా విభాగం అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, మెకానిక్‌లతో పాటు పీఆర్వో సుమన్ తదితరులు పాల్గొన్నారు.





## జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేత టెక్కలి

**మందస, జనవరి 16(వార్త):** మందస మండలంలోని పిడిమందస పంచాయతీలోని మధ్య గ్రామంలో పండగ సందర్భంగా పాల పోలమ్మ తల్లి యువజన విభాగము ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో పలు జట్లు తలపడ్డాయి. విజేతగా టెక్కలి జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, రెండవ స్థానంలో చాపరాయి, మూడవ స్థానంలో మందస నిలిచాయి. ప్రథమ బహుమతి పదివేల రూపాయలు, రెండవ బహుమతి ఆరు వేలు, మూడవ బహుమతి పిడిమందస గ్రామ సర్పంచ్ సేనాపతి ఉమామహేశ్వరరావు, స్థానిక పెద్దలు మాజీ సర్పంచ్ గేదెల రామకృష్ణ, పొట్టి కోదండరావు, గేదెల సుభాషు, బిల్లింగి కామేశ్వరరావు, కద్దాల దామోదర్ రావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బురద ఢిల్లేశ్వరరావు, కొంకి భుజంగరావు, బిల్లింగి ప్రకాష్ రావు, అగ్గున్న శంకర్రావు, సిలగాన వాసుదేవరావు, బురద అనిల్, ముడియ సందీప్, ముంజేటి రేవతి, మిగిలిన సభ్యులు ప్రోత్సాహంతో నిర్వహించడమైనదని నిర్వాహకులు తెలిపారు.

## బంజరి కేశుపురంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం



**మందస, జనవరి 16(వార్త):** మందస మండలం ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీ బంజరికేశుపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వాలీబాల్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త జికె నాయుడు ప్రారంభించారు. టోర్నమెంట్ లో 22జట్లు తలపడనున్నాయి. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, ముడుమంచి నవీన్ కుమార్, రెయ్యి రాజు, మోహన్, వంశీ, మడియా ధర్మారావు, బొంగు దామోదర్, మల్లేన జనార్ధన, శివంగి మురళీ, గుజ్జు తులసయ్య, సబ్ ఇన్స్పెక్టర్ కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నబరంపురంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**మందస, జనవరి 16(వార్త):** మందస పంచాయతీలోని చిన్నబరం పురం గ్రామంలో సంక్రాంతి సంబరాలు ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. గ్రామంలో అందరూ కలసి పండుగను ఆనందించారు. పెద్దలకు, పిల్లలకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు ఆకర్షణీయంగా నిలిచాయి. విజేతలకు విలువైన బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ ఏడాది సంక్రాంతి పండుగ కన్నుల పండువగా జరగడంతో గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విజేతలకు విలువైన బహుమతులు సైతం అందజేశారు. గ్రామ పెద్దలు మెట్ట మహేశ్వరరావు, బొచ్చ ప్రకాశరావు తదితరులు ఆటలపోటీలకు జడ్జీలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో యూత్ కమిటీ సభ్యులు సతీష్, రాజేష్, మురళి, శివ ప్రసాద్, శ్రీకాంత్, జైరాం, శ్రీను, జగన్, ఉదయ్, రవి తదితరులు కీలక పాత్ర పోషించి, గ్రామస్తుల మన్ననలు పొందారు.



## తమ్మినేనికి పరామర్శ

**ఆమదాలవలస, జనవరి 16 (వార్త):** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, తనయుడు తమ్మినేని చిరంజీవి నాగ్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం పరామర్శించారు. వారి వెంట శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాల వలస, ఇచ్ఛాపురం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## వంద మంది ప్రాణాలు కాపాడాం

### * రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్ రావు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 16 (వార్త):** వంద మంది ప్రాణాలు కాపాడడం ఆనందంగా ఉందని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్ రావు తెలిపారు. పూర్వపు కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ ప్రారంభించిన ప్లాస్మాదాన కేంద్రంలో ఇప్పటి వరకు వంద ప్లాస్మా డొనేషన్స్ చేపట్టి మహిళలు, వృద్ధులకు, చిన్నపిల్లలు, పురిటి పిల్లలకు తక్షణ అవసరం నిమిత్తము ప్లాస్మా, ప్లేట్లెట్స్ దానంతో ప్రాణదానం చేశామన్నారు. జిల్లాలో ప్లాస్మాదాన కేంద్రం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ప్లేట్లెట్స్ కొరత అధికంగా ఉన్న వారికి, ప్లాస్మా అవసరమైన అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సహకారంతో రెడ్ క్రాస్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ప్లాస్మా అవసరం రోజురోజుకు పెరుగుతున్నందున దాతలు ముందుకు వచ్చి ప్లాస్మా దానం చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా ప్లాస్మా దానానికి అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్ ని సత్కరించి అభినందించారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన కోరాడ సతీష్ ప్లాస్మా దానం చేసినందుకు చైర్మన్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పి.వైకుంఠరావు, కే సత్యనారాయణ, ఆయుష్.బేగం, జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంరద్దు

**పలాస, జనవరి 16 (వార్త):** కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమం (మీకోసం) శుక్రవారం రద్దు చేస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ప్రక్రియ కొనసాగుతున్న దృష్ట్యా నిర్వహించడం లేదన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు పై విషయాన్ని గమనించి ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమానికి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు రావద్దన్నారు.

## డ్రోన్లతో నేర నియంత్రణ



**శ్రీకాకుళం క్రైం, జనవరి 16 (వార్త):** నేరాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో జిల్లా పోలీసు యంత్రాంగం డ్రోన్ కెమెరాలతో పటిష్ట నిఘా ఉంచుతున్నారు. నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్లు నిఘా ఏర్పాటుచేసి అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుపతిపాలెం, పిసిని, మరువాడ, చిల్లపేటరాజం, బొడ్డపాడు, కోటపాడు తదితర గ్రామాల్లో డ్రోన్ నిఘా పెట్టి కోడిపందేలు, జూదం, గంజాయి వినియోగం, పేకాట శిబిరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించి వారిపై నిఘా పెట్టారు.

## నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

**శ్రీకాకుళం టౌన్, జనవరి 16 (వార్త):** ప్రతి నెల మూడవ శుక్రవారం నిర్వహిస్తున్న స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు వినతుల స్వీకరణ జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వీర గున్నమ్మ

### * సాసుమాన వీరగున్నమ్మ వంశీయులు

**పలాస, జనవరి 16 (వార్త):** సామాన్య రైతుకుటుంబంలో పుట్టి ధైర్యంగా ముందుకు కదిలి ఆంగ్లేయులతో పోరు బాటపట్టి వారి తూటాలకు బలైపోయి వీర గున్నమ్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని సాసుమాన వీర గున్నమ్మ వంశీయులు గుర్తు చేసుకున్నారు. పలాస మండలం గరుడుగండి గ్రామంలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో తొలి ఉద్యమ గ్రామం గుడారి రాజమణీపురము రైతులు పండించే పంటలో మూడో భాగాన్ని కప్పం (పన్ను) కింద ఆంగ్లేయులు వసూలు చేయడాన్ని గ్రామప్రజలు మొట్టమొదటగా అడ్డుకున్నారన్నారు. అటవీ ఉత్పత్తులను తెచ్చుకునేందుకు బ్రిటిష్ పోలీసులు అడ్డుకోవడంతో పోరాటానికి దారితీసింది. 1940 ఏప్రిల్ 1న గుడారి రాజపురం పొలిమేరల్లో బ్రిటిష్ పోలీసులకు, రైతులకు పోరాటం జరిగింది. యుక్త వయసులో ఉన్న సాసుమాన గున్నమ్మ వీరనారిగా కదం తొక్కుతూ బ్రిటీష్ పోలీసులపై దాడి చేసిందన్నారు. ఆమెపై పోలీసులు తుపాకీ కాల్పులు జరపడంతో నిండు చూలాలు గున్నమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచిందన్నారు. ఆమె స్మారకార్థం గుడారి రాజపురం గ్రామాన్ని వీరగున్నమ్మపురంగా పిలుస్తారంటామన్నారు. ఈ కార్యక్రమంలో సాసుమాన రామారావు, ఆర్అండ్‌బి డీఈ సాసుమాన రామినాయుడు, సాసుమాన రామయ్య, సాసుమాన జగన్నాయకులు, సాసుమాన వైకుంఠ రావు, సాసుమాన హేమ సుందర్ రావు,సాసుమాన చంద్రమౌళి,సాసుమాన సూర్యనారాయణ, సాసుమాన విద్యాసాగర్,సాసుమాన అనిల్ కుమార్, సాసుమాన వేణుగోపాల్, సాసుమాన ధనుంజయ, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.



## కుమార్ రాజుకు 'తెలుగు కీర్తి' పురస్కారం

**శ్రీకాకుళం టౌన్, జనవరి 16 (వార్త):** శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, శ్రీ శ్రీ కళా వేదిక అధ్యక్షుడు, కవి రచయిత బుర్రి కుమార్ రాజు తెలుగు కీర్తి పురస్కారానికి కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తి మండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఎంపిక చేశారు. తనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసినందుకుగాను కుమార్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 21న విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికలో పురస్కారానికి అందుకోనున్నారు.

## తేలుకుంచిలో ప్రమాదకరంగా స్తంభాలు

**ఇచ్ఛాపురం, జనవరి 16(వార్త):** తేలుకుంచి గ్రామంలో ప్రమాదకర స్థితిలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. తుఫాన్ గాలులను తట్టుకొనే విధంగా స్పన్ అనే రకం విద్యుత్ స్తంభాలు అమర్చారు. రత్తకన్న తేలుకుంచి రహదారిపై ప్రమాదకరమైన మలుపు వద్ద స్తంభాలు వేశారు. ఈ మలుపు వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. అటువంటి చోట స్తంభం వేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడతారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.



## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**వంగర, జనవరి16 (వార్త):** మండలానికి సంబంధించి 11 కేవీ సీతాదేవిపురం ఫీడర్ లైన్ మరమ్మత్తుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని వంగర విద్యుత్ ఏఈ వి.సాంబశివరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో పాత మరువాడ, కొత్త మరువాడ,సీతాదేవిపురం గ్రామాలకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## పాలవలస మృతి పార్టీకి తీరనిలోటు

**వంగర, జనవరి16 (వార్త):** రాజకీయ గురువు పాలవలస రాజశేఖరం మరణం పార్టీకి తీరని లోటని ఎంపీపీ సురేష్ ముఖర్జీ అన్నారు. కోస్తాంధ్ర జిల్లాలోని అత్యంత సీనియర్ రాజకీయవేత్త అని తెలిపారు. అనేక పదవుల్లో ఉండి ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

### * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జనవరి 16(వార్త):** రాష్ట్ర పురోభివృద్ధికి యువత పాత్ర కీలకమని, రాబోవు తరాలకు మార్గదర్శకులుగా నిలబడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రికను నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. శ్రీకాకుళంలో వచ్చేనెల 6 నుంచి 9 వరకూ జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘ అధ్యక్షులు చాపర సుందరలాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 317 మంది అర్హత

### *సజావుగా కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షలు
### *జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం క్రైం, జనవరి16 (వార్త):** పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. గురువారం పురుష అభ్యర్థులు 317 మంది ఈ పరీక్షల్లో అర్హత సాధించారు. 727 మంది హాజరు కావాల్సివుండగా 478 మంది హాజరయ్యారు. వీరిలో 317 మంది అభ్యర్థులు అర్హత పొందారు.







Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546